

వల్లంపాటి వెంకటసుబ్బయ్య
రామనాధం ట్యూషన్లు

ప్రశ్నపడుచు ప్రేమలా వెన్నెల కురుస్తోంది.

ఆకాశాన్ని సముద్రంచేసి, చంద్రుణ్ణి నావనుచేసి దేవతలు నౌకావిహారానికి బయల్దేరారు. సౌఖ్యం పట్టుమీద కూచుని చంద్రుణ్ణి చూస్తున్నాను. నేను వినకపోయినా తన కాలేజీ ప్రేమవ్యవహారాల్ని చెబుతున్నాడు బావమరిది సత్యం. ఈదురు గాలిలా సాగుతున్న సత్యం మాటలు ఆగాయి. నేను బాధ కించిత్తు సంతోషంతో తిరిగి చూశాను. ఎవరో ఒకతను గుట్టఎక్కుతూ వస్తున్నాడు... నాలుగంగల్లో మమ్మల్ని సమీపించాడు. కానీ సత్యాన్ని చూడగానే అతని ముఖం నిరాశతో వెల్లబారింది.

"ఏమిటి మాస్టారూ?" అన్నాడు సత్యం.

"బాడ్ లక్! ఎవరో అనుకొనివచ్చాను. అన్నట్టు నువ్విప్పుడు కాలేజిలో చదువుతున్నావుకదూ? చాలా సంతోషం! అక్కడ నీకు ట్యూషనెవరు చెబుతున్నారు? అన్నట్టు నీకు ట్యూషనెందుకూ? తెలివైనవాడివి! తెలివంటే జ్ఞాపకంవస్తోంది. ఇప్పుడు నా దగ్గరో అబ్బాయి వున్నాడు ట్యూషనుకు. సత్యం! అంతటి బంకమట్టిబుర్రగాణ్ణి నేనింతవరకు చూడలేదనుకో! ఆ.....నేనెందు కొచ్చాను? ఓ! వీర్నిచూస్తే జ్ఞాపకం వస్తోంది. నిప్పుపెట్టెకోసం! సార్! కాస్త నిప్పుపెట్టెవుంటే యిస్తారా?" చెయ్యి చాచాడు.

వడగళ్ళవాన అకస్మాత్తుగా ఆగినట్లయింది. దీర్ఘంగా ఒక్కసారి వూపిరి పీల్చుకొని నిప్పుపెట్టె తీసియిచ్చాను. ఆయన సిగరెట్టు వెలిగించుకొని నిప్పుపెట్టె తిరిగి యిచ్చాడు.

"సత్యం! ఇంతకూ వీరెవరు?"

"వీరా మేష్టారూ! మా బావగారు. మా చెల్లాయి సుశీల లేదూ—ఆవిడగారి భర్తగారు. మదనపల్లి హైస్కూల్లో మేష్టారు!" అన్నాడు సత్యం.

ఆగంతకుడిలో ఒక్కసారిగా ఉత్సాహం పెల్లుబికింది.

"మీరింతకూ మా జాతివారేనన్నమాట! ఆనందం! పరమానందం! ఆ...మీరేమాత్రం సంపాదిస్తారు ట్యూషన్లలో?"

నేను ఆశ్చర్యపోయ్యాను అతని మొదటి ప్రశ్నకు.

"కనీసం మూడువందలైనా?"

నేను జవాబు చెప్పలేదు.

"పోనీ టూ హండ్రడ్?"

"ఒక్క కానీ కూడా లేదు" అన్నాను.


"ఆశ్చర్యం! పరమాశ్చర్యం! నేను.....నేను యిందాకా రెండువందలు సంపాదించేవాణ్ణి. ఇప్పుడు మూడొందలు—మూడొందలు సంపాదిస్తున్నాను."

"మూడువందలే! మేష్టారూ! అం.....త... డబ్బు యేం చేస్తారండీ?" ప్రశ్నించాడు సత్యం నావైపు చూసి కన్నుగిలుకుతూ.

అతని ముఖంలో ఆశ్చర్యకరమైన మార్పు వచ్చింది. ముఖం పాలిపోయింది, బాధతో పెదవులు ముడేసుకున్నాయి.

"ఏం చేస్తానా? ఆ.....ఏంచేస్తాను! ఉరిపోసుకుంటాను. సన్యాసుల్లో కలుస్తాను... ఈ రెండూ చెయ్యలేకపోతే పెళ్ళిచేసుకుంటాను. కానీ...ఈ ప్రశ్న

(59-వ పేజీ చూడండి)



ఔషధ లక్షణాలు కలసిగా, ఊటనుంచి ఉబుకుతున్న దృశ్యం.

# బాడ్ నైన్ ఆర్


ఎన్. చెంగల్ రాజు

(వీరు ప్రస్తుతం పశ్చిమ జర్మనీలో ఉన్నారు.)

బాడ్‌నైన్ఆర్ (Bad Neunahr) అంటే జర్మన్ భాషలో 'కొత్త ఆర్ నది స్నానఘట్ట' మని అర్థం. ఇది ఒక వూట. ప్రఖ్యాత జర్మన్ పట్టణమైన కొలోన్ (Cologne) కి దక్షిణ ఎనభై మైళ్ళ లోపుగా ఉన్నది. ఈ వూట జలాలలో అవుషధాలెన్నో ఉన్నాయనీ, వాటివల్ల ఎన్నో రకరకాల జబ్బులు నయమవుతాయనీ అంటారు. అందుకని ఇక్కడికి ప్రపంచమంతటినుంచీ ప్రజలు వచ్చి పోతూఉంటారు.

ఈ వూట ప్రత్యేకత ఏమిటంటే, నీరు భూమి క్రింద 310 అడుగుల లోతునుంచి భూమిపైన 65 అడుగుల ఎత్తుకి లేస్తాయి. (అంటే మొత్తం 375 అడుగు లన్నమాట) ఈ నీటిలో వివిధమైన ధాతుసంపద ఉన్నది. పొటాషియం, సోడియం, కాల్షియం, మాంగనీస్ మొదలైనవన్నీ పరిశోధనవల్ల బయటపడ్డాయి. ఒక గ్లాసు ఖరీదు సుమారు రు. 1.05 ఉంటుంది. ప్రతిరోజూ కొన్ని లక్షల సీసాల జలం ఇతర దేశాలకు ఎగుమతి అవుతుంది.

ఇక్కడ రోగుల సౌకర్యం కోసం ప్రైవేటు గదులు నిర్మించారు. మనిషికి దినానికి సుమారు 115 రూపాయలు పుచ్చుకుంటారు. అయినా రోజు రోజుకీ ఇక్కడికి వచ్చేవారి సంఖ్య పెరుగుతున్నదే కాని తగ్గటం లేదు. ★



యాత్రికుల సదుపాయం కోసం అక్కడఉన్న ఒక పెద్ద హోటల్.

# రామనాథం ట్యూషన్లు

(9-వ పేజీ తరువాత)

...డగొద్దని యెన్నిసార్లు చెప్పానోయ్ నీకు....!" ఎదలో గుచ్చుకున్న ముల్లును లాగి పారవేసేశక్తి లేక లేచి వెళ్ళిపొయ్యాడతను.

నాకేమీ అర్థంగాక సత్యంవైపు చూశాను. వాడు అమృతవర్షంలాంటి వెన్నెల్లోకి చిరునవ్వుతో విషాన్ని చిలుకుతున్నాడు... అతనిలో దాగివున్న యేదో బాధ సత్యంమాటలతో బయటపడింది. గత జీవితానికి సంబంధించిన యేదో విషాదస్మృతిని సత్యం కెలికాడు......లేకుంటే అతనికంత బాధ కలిగేది కాదు"

"ఏమిటోయ్ యీ కథ?" సత్యాన్ని అడిగాను.

"అదా? చక్కని కథ! వినాలనిపించే కథ!

"అలాగా?"

"వీరు—వారే రంగనాథంగారు మా మేష్టారు. ప్రేమ, బాధ, ఆల్జీబ్రా, వేదాంతం కలిపి బహు చక్కగా పాఠం చెప్పేవాడు. కానీ ఆ బ్రహ్మదేవుడు వీరికి చదువు సంధ్య, అందం చందం, తెలివీ తేట యిచ్చి శ్రీవారి బుర్రనుంచీ కామన్‌సెన్సుని పెరికి అవతలపారేశాడు. వారికి చిన్ననాడే అమ్మా నాన్నా చనిపొయ్యారు పాపం! కానీ వాళ్ళు అదృష్టవంతులు. వాడెవరో అన్నట్టు చనిపోయినవాళ్ళందరూ మనదేశంలో అదృష్టవంతులేగా మరి! వాళ్ళు వదిలి వెళ్ళిన ఆస్తితో మేనమామగారు చదివించారు వీర్ని. మేనమామగారి పెద్దకూతురు ఇందిరకు వయస్సొచ్చేసరికి వీరికి ఉద్యోగంకూడా వచ్చింది. రామనాథంగారు నానాఅవస్థపడి—దీనికి అచ్చ తెనుగు అనువాదం—నానాగడ్డికరిచి, మేనమామగారి మెప్పుకోసం ఓపినంత డబ్బు పంపేవారు—ఎందుకనుకున్నారు?"

"ఇందిరకోసం"

"కరెక్టు! మీకూ కొసగోరంత ఆలోచనుంది. ఎంతైనా మా వూరి అల్లుడుగదూ! రామనాథంగారు ట్యూషన్లుచెప్పీ, పుస్తకాలు చెప్పీ, పై సాకు పైన ముడేసి సంపాదించిన డబ్బును కట్నంగా యిచ్చి ఇందిరకు పెళ్ళిచేశాడు వాళ్ళ మామయ్య."

"ఏవూళ్ళో యిచ్చాడేమిటి ఇందిరను?"

"ఏదో ఒక వూళ్ళో యెవరో ఒక పల్లెకాట్లో రామనాథయ్యకు అనుకోండి. ఇలాగే రెండో కూతురికికూడా పెళ్ళిచేశాడు."

"ఎవరి డబ్బుతో? రామనాథంగారి డబ్బుతోనే!"

"రామనాథంగారి డబ్బుతో గాకపోతే మన డబ్బు జోలికొస్తాడూ వారి మామయ్య. వస్తే ముక్కలు విరగతన్నమూ! తర్వాత—మూడోకూతురు కూడా పెళ్ళి కెదిగింది. ఆవిడపేరు విమల. ఈవిడ పెళ్ళికెదగగానే రామనాథంగారు కాస్త మేలుకొని సరాసరి మామయ్యగారిని కలుసుకొని విమలను తనకేయిచ్చి పెళ్ళిచెయ్యాలని నిక్కచ్చిగా చెప్పేశారు"

"ఒప్పుకున్నాడా?"

"మనలాంటి బుద్ధిలేనివాడేమిటి ఆయన—లౌక్యుడు!"

"ఏమన్నాడేమిటి?"

"చూడయ్యా రామనాథం! పెద్దమ్మాయి నీకు యీడుకాదు. అందువల్ల యివ్వలేదు. రెండో అమ్మాయిని యివ్వాలనే అనుకున్నాను. తీరాచూస్తే ఆపిల్ల ఎవర్నో ప్రేమించేసింది. అందువల్ల వీల్లేకుండాపోయింది. ఇక మూడో అమ్మాయి విమలుంది. ఆవిడ ఒప్పుకుంటే నా అభ్యంతరమేమిటి మధ్య!" అన్నారు మామయ్యగారు.

రామనాథంగారు నేరుగా వెళ్ళి విమలనే అడిగాడు.

"నీతో పెళ్ళేమిటి—అసలు నీకు పిచ్చి" అంది విమల.

"అంతే! ఆక్షణంనుంచీ ఒక్క నెలలోగా రామనాథంగారు పిచ్చివాడైపొయ్యారు" ఆగాడు సత్యం.

"అదెలాగోయ్?" ప్రశ్నించాను.

"అసలు వారి దదోకరకం చాదస్తం! అంటే పిచ్చికి ఒక డిగ్రీ తక్కువ. వారెంత అమాయకులు కాకపోతే నానా అవస్థపడి, ట్యూషన్లు చెప్పి సంపాదించిన డబ్బు—ఎంతనుకున్నారు — దాదాపు ఐదు వేలు—వాళ్ళ మామయ్యనోట్లో పెట్టి నీళ్ళు పోస్తారు. అందులోనూ వారిది అఘోరకం మనస్సు....."

---

క్లాసులో ఉపాధ్యాయుడు భూమ్యాకర్షణ శక్తిని గూర్చి చెప్పుతూ తన చేతిలో నున్న సుద్దముక్కను పైకి విసిరాడు. అది తిరిగి తన ఎదుట నున్న బల్లమీద పడింది. అంతలో నొక విద్యార్థి నిలిచి "మాష్టారూ! భూమికి ఆకర్షణశక్తి వుందని చెప్పారు. మరి సుద్దముక్క బల్లమీద పడింది. బల్లకు కూడా ఆకర్షణశక్తి వుందా సార్?" అని ప్రశ్నించాడు. దానితో క్లాసంతా గొల్లుమన్నది.

అగ్గాల సత్యనారాయణ (రాజమండ్రి)

---

"వారికి పిచ్చిపట్టిందన్నావ్! మరి బాగానే వున్నాడే!"

"చూశారా! అసలు సంగతి మరిచేపొయ్యాను. అంటే నేను గొప్పవాణ్ణయిపోతున్నానన్నమాట! పాయింటుకొస్తాను. వీరికి పిచ్చిపట్టగానే స్నేహితులు కొందరు నెల్లూరులోవున్న ఒక బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరు — ఆయనా రామనాథంగారి స్నేహితుడే — వీళ్ళందరూ కలిసి రామనాథంగారిని ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో నాలుగు నెల్లున్నారు. వారి అదృష్టంకొద్దీ బాగైంది. మన కర్మంకొద్దీ ఆస్పత్రినుంచీ బయటపడ్డారు. కానీ ఒక తమాషా! ఆస్పత్రినుంచీ రాగానే వారి డబ్బు దాహం యిబ్బడిముబ్బడైపోయింది. ముందున్న భోళాతనం కలికంలోకి దొరక్కుండాపోయింది. వారిప్పుడు నెలకు మూడువందలు సంపాదిస్తారు ట్యూషన్లుచెప్పి."

ఏంచేస్తాడేమిటి ఆడబ్బు? మళ్ళీ యెవర్నయినా కొత్తమామగార్ని వెదికాడా? లేక—ఇతర దుర్గు..."

"ష్టాప్! అలాంటివేం లేవు. రామనాథంగారికీ, వారి మామగారికి యిప్పుడు మాటల్లేవు. ఇప్పుడు వారిది ఒకే పట్టుదల. బాగా డబ్బు సంపాదించాలి. ఇందిర, నాకు పేరు తెలీని ఆ రెండో అమ్మాయి, విమల వీళ్ళందరికంటే చక్కని అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలి. వాళ్ళను తలదన్నినట్లు బ్రతకాలి. ఇదే వారికి జీవితవాంఛయిపోయింది......"

సత్యం చాలా తేలిగ్గా చెబుతున్నా రామనాథంగారి కథవెనుక దాగున్న విషాదం నన్ను ఆలోచనల్లోకి దించింది. ఒక్కమాటతో నిలువెత్తు పురుషుణ్ణి పిచ్చివాణ్ణి చెయ్యగలిగిన స్త్రీనాలుక యెంత పదునైందో తలుచుకుంటే ఆశ్చర్యమేసింది..... విమలకు రామనాథాన్ని పెళ్ళిచేసుకుంటే వచ్చే నష్టమేమీలేదు. రామనాథంపట్ల ఆవిడ చిన్ననాటి నుంచీ పెంచుకున్న తేలికభావం ఆవిడచేత ఆమాట అనిపించివుంటుంది.

"విమలను ఎవరికిచ్చారోయ్?" ప్రశ్నించాను సత్యాన్ని.

"ఎవరికంటే......ఆ.....ఆయనో బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసు గుమాస్తానో యేమో! ఏమో బావా! ఈలోగా నాకు సినిమా పాటలే జ్ఞాపకం వుండడం లేదు — ఇవెలా వుంటాయి!"

*　　*　　*

కాలచక్రభ్రమణంలో ఒక సంవత్సరం గడచిపోయింది .... ఒకరోజున స్కూల్లో కూచొని కాంపొజిషన్ పుస్తకాలను ఎర్రసిరాతో అలుకుతున్నాను. పోస్ట్‌మాన్ వచ్చి ఉత్తరం యిచ్చివెళ్ళాడు. చించి చదివాను. నెల్లూరునుంచి చంద్రం రాశాడు.

"సోదరా!

నేను బ్రతకాలా చావాలా అన్న స్థితిలో వున్నాను. నా బ్రతుకు కన్నీళ్ళతో చెయ్యి కడిగేలా అయిపోయింది. మా ఆఫీసులో డబ్బు దొంగతనం జరిగింది. ఇటు వాలీ అటు వాలీ అది నానెత్తిమీదికి వాలింది. నీతో చాలా విషయాలు మాట్లాడాలి. తక్షణం బయలుదేరి వచ్చేది.

చంద్రం."

రెండు రోజులు శలవుపెట్టి బయలుదేరాను. నా బాల్యమిత్రుల్లో చంద్రశేఖరం ఒకడు. జీవితాన్ని వేరుగా, ఉద్యోగాన్ని వేరుగా భావించి రెండిటిపట్లా సమానమైన శ్రద్ధను చూపుతాడు. చంద్రం జీవితంపట్ల యెంత జాగరూకుడో ఉద్యోగంపట్లకూడా అంతే! ఈస్థితి—అందులోనూ దొంగతనం నెత్తినపడడం చంద్రంలాంటివాడు భరించలేడు. అతని భార్యకూడా చాలా మంచిదిగానే కనబడింది పెళ్ళిరోజు. పాపం! ఎంత బాధపడుతూవుందో. అందులోనూ పసిది! జీవితానుభవంలేనిది....

నెల్లూరు బస్‌స్టాండులో దిగి సంచీ పుచ్చుకొని చంద్రం యింటివైపు నడుస్తున్నాను. ఎదురుగా రామనాథంగారు కనిపించారు.

"నమస్కారమండి. జ్ఞాపకం వున్నానా?" పలకరించాను.

"చంపేశారు! జ్ఞాపకం వున్నానా.....యెంత సొదా ప్రశ్న వేశారండీ నన్ను....నాది ఫోటోగ్రాఫిక్ మైండ్. అంత సులభంగా మరిచిపోనండోయ్"

"సంతోషం"




## రామనాథం ట్యూషన్లు

"ఆఁ......సంతోషం అంటే జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడు నేను చాలా సంతోషంగా వున్నాను. అమ్మాయిని చూట్టానికి వచ్చానిప్పూరు....." న్నారు రామనాథంగారు.

రామనాథంగార్ని పరిశీలనగా చూశాను. ఆయన ముఖంలో ఉత్సాహం వెల్లుబుకుతోంది. లోతుకుపోయి చీకటిలో మిణుగురుపురుగుల్లా మెరిసే కళ్ళు కాంతివంతాలైనాయి. ఖరీదైన బట్టలు ధరించారు. బట్టలకు రాసుకున్న సెంటువాసన ఒళ్ళు తిమ్మిర్లెక్కిస్తోంది.

"చాలా సంతోషమండి. పప్పన్నం పెడ్తారన్న మాట త్వరలోనే!" అన్నాను.

"త్వరలో కాదండీ— చాలా త్వరలో! వస్తాను మరి. చాలా పనులున్నాయి" వెళ్ళిపొయ్యారు రామనాథంగారు. నేను చంద్రం యిల్లు చేరాను.

నన్ను చూడగానే చంద్రం చాలా సంతోషించాడు. భోజనాలతర్వాత నేను, చంద్రం, అతని భార్య కూచున్నాము. చంద్రం సంగతంతా వివరంగా చెప్పాడు.

"......దొంగతనం చేసిందెవరో వాడు. నేను చెప్పానుగా సాక్ష్యాలు—వాటితో కేసు నా నెత్తినే పడుతుంది. ఈ దొంగతనం మా ఆఫీసులో యెవరికీ తెలీదు. మా ఆఫీసరు చాలా మంచివారు. ఆయన కూడా నేనీ ఘండాలం పని చేశానని నమ్మడం లేదు. డబ్బు యెలాగో నాలుగు దినాల్లో సర్దితే కేసురాకుండా చెయ్యొచ్చునంటున్నారు.....నాకు పూచికపుల్ల ఆస్తిలేదు. అప్పు చేద్దామంటే రెండు వేల రూపాయలు యెవడు అప్పిస్తాడు నా ముఖానికి. ఏంచేద్దాం......ఇదంతా పూర్వజన్మంలో చేసుకున్న ఖర్మ. లేకుంటే క్యాష్‌కౌంటర్ తాళం చెవులు వ్యాను వెధవ కెవరైనా యిస్తారా!...... నా బ్రతుకిలా కాలిపోయిందిరా! ఆత్మహత్య చేసుకుందామనుకుంటే నాకా అధికారం లేదనిపించింది. నాకో భార్య వుంది—అందులోనే ఆవిడ ఒట్టి మనిషి కాదు"

చంద్రంభార్యకు కళ్ళనిండా నీళ్ళు నిండాయి. చెరుగుతో తుడుచుకుంటూ గదిలో కెళ్ళింది. గదిలోనుంచి ఎక్కిళ్ళు స్పష్టంగా వినబడుతున్నాయి...

కాస్సేపు విశ్రాంతి తీసుకుందామని పడుకున్నాను. మధ్యాహ్నం నిద్ర అలవాటులేకపోయినా లేచేసరికి నాలుగున్నర కావస్తోంది., ఎవరో తలుపు తడుతున్నారు.

"విమలా! విమలా!"

చంద్రంభార్య వెళ్ళి తలుపు తీసింది. ఆశ్చర్యం! రంగనాథంగారు లోపలికొచ్చారు. తెరచిననోరు ముయ్యకుండా అలాగే నిలబడిపోయింది ఆవిడ. ఆవిడకంటే యెక్కువ ఆశ్చర్యపొయ్యాను నేను. చంద్రం భార్యపేరు విమలని యిప్పుడు జ్ఞాపకం వస్తోంది. ఎప్పుడో పెళ్ళిలో విన్నపేరు.....మరచిపొయ్యాను......రామనాథంగారలాగే వాకిట్లో నిలబడి వున్నారు. వారి ముఖంలో అదే కాంతి, వారి పెదవులమీద మంచులో తడిసిన మల్లెపువ్వులా స్వచ్ఛమైన చిరునవ్వు!! విమలకు ఎందుకో దుఃఖం ఆగలేదు. చెరుగు నోటికి అడ్డం పెట్టుకొని గోడవైపుకు తిరిగి యేడవసాగింది......

రామనాథంగారు నవ్వుతూ వెళ్ళి ఆవిడముందు నిలబడ్డాడు.

"ఛ! ఛ! ఎందుకమ్మా అలా యేడుస్తావ్! ఇలా చూడు. మేము పిల్లలకు పాఠాలు యెంత తెలుసో తెలుసుకోవడానికి పరీక్షలు పెడతాం. అలాగే భగవంతుడుకూడా యీ మానవులు దుఃఖాన్ని యెలా భరిస్తారో చూద్దామనిపెట్టే పరీక్షలమ్మా యీ కష్టాలు. అవి యీ రోజొస్తాయి. రేపటికి వుండమన్నా వుండవు."

"అదికాదు బావా...మీకు నేనుచేసిన ద్రోహం..." పిలుపు, మాటలు కలగలుపుగా వచ్చాయి విమల కంఠంనుండి.

"ద్రోహం! ఎవరు చేశారు. ఎవరికి చేశారు! అసలు ఆపదమే వెధవ పదం! నువ్వో పిచ్చిపిల్లవి. నీకు ద్రోహం చెయ్యడమేం తెలుసు. ఇక మీ నాన్న యేదో అవసరంవుండి డబ్బువాడుకున్నాడు. అసలు నాకు డబ్బెందుకూ?"

"అదికాదు బావా......"

"ఏదీకాదు. నువ్వూరుకో. చంద్రశేఖరంగారి బ్లాక్‌డెవలప్‌మెంటు ఆఫీసరులేడూ—వాడు నాకు ప్రాణ స్నేహితుడు. నాకు అన్నీ చెప్పాడు. ఇదిగో పర్సు.....ఇందులో రెండువేలా మూడు వంద లున్నాయి. పుచ్చుకో.....ఫరవాలేదులే! నేనుగదమ్మా యిస్తోంది.....వెరీగుడ్....నువ్వు అపరంజిలాంటి పిల్లవి......ఇక నేను వెళ్తాను" రామనాథంగారు బయలుదేరారు. విమల దేహంమీద ప్రజ్ఞ లేకుండా యేడుస్తోంది. కళ్ళు కెంపుల్లాగై పొయ్యాయి. చెక్కిళ్ళమీద కన్నీళ్ళు చారికలు కట్టాయి.....రామనాథంగారి కళ్ళలో రెండు కన్నీటి బిందువులు నిలిచాయి. వెళ్తున్నవారు ఆగి విమలవైపు తిరిగి మళ్ళీ అన్నారు.

"పిచ్చిపిల్లా! ఇప్పుడేం జరిగిందని అలా గుండె పగిలిపొయ్యేలా ఏడుస్తావ్?.......నత్తింగ్..."

"బావా! భోజనమైనా చెయ్యకుండా....."

"ఆఁ......యేం ఫరవాలేదు. అదీ కాకుండా నాకు యింటిభోజనం రుచించదు" రామనాథంగారు వెళ్ళిపొయ్యారు.

విమలకు దుఃఖం ఆగలేదు. ఎవరో కాళ్ళుపట్టి గుంజినట్లుగా నేలమీద కూలబడిపోయింది. గదిలో నుంచి కిటికీగుండా చూస్తున్న నేను కాళ్ళు నేల కంటుకుపోయినట్లు నిలబడిపొయ్యాను....

రాత్రి విమలలేని సమయం చూసుకొని చంద్రాని కంతా చెప్పాను. నీళ్ళు నిండిన గొంతుకతో అన్నాడు— "మానవుల్లో కూడా అలాంటి దేవుళ్ళు వుంటారు"

కాలచక్రానికి ప్రపంచంలో జరిగే సంఘటనలతో పనిలేదు....దానిపాటి కది భ్రమిస్తూ వుంటుంది. చంద్రానికి గుమ్మడిపండులాంటి కొడుకుపుట్టాడు. వాడికి రామనాథం అని పేరు పెట్టుకున్నారు. కాలచక్రం భ్రమిస్తోంది.....ఋతువులు మారుతున్నాయి......ప్రకృతి నిత్యమూ మారుతోంది.....కానీ రామనాథంగారి జీవితంలో మార్పులేదు—వారిది ఒకేరకమైన జీవితం! జీవితంలో వారికున్నవి రెండే రెండు నియమాలు. ఆనాటినుంచి యీనాటివరకూ ట్యూషన్లకు డబ్బు తీసుకోలేదు—పెళ్ళి చేసుకోలేదు. ★



సుఖజీవిత సేవ
భారతి "సిద్ధ వైద్య మహిమ" మన దేశ సిద్ధుల సాటిలేని శ్రీ రక్ష ఒక తార్కాణము.
"మేల్ మాయిల్ మందు"
ప్రపంచములో ప్రఖ్యాతి గాంచిన మేహ, మధుమేహ నివారిణి
భయంకరమైన మేహ వ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి
మేహారోగ నివారణ మూలిక, లేహ్యము.
డా॥ కె. టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు
5/22, మేల్ మాయిల్ (P. O.) (N. A. Dt.) S. India.



PAKCO పాక్కో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు
—: ప్రత్యేక లక్షణములు :—
* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* బాష్ ఫ్యూయల్ ఇంజక్షన్ పరికరములు

మద్రాసు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు :
Grams: LAMP K. S. SHIVJI & CO. (Estd 1903)
Phone: 3617 పోస్టుబాక్సు నెం. 5, 178-79 బ్రాడ్వే, మద్రాసు-1.



*Indian Quality Products*
Now first choice


Kedarnath Parsotamdas & Co. (PRIVATE) Ltd.
37, NETAJI SUBHAS ROAD, CALCUTTA 1 (INDIA)
PHONE-22-1031
CABLES-COTEXPO
AGENTS WANTED